తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాదాద్రి భువనగిరి

గురువారం 27 ఆగష్టు 2026

పేజీలు : 8

Follow :


ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే..

# ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం..!



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 26(జనంసాక్షి):**
పేదల సంక్షేమంతో పాటు కార్పోరేషన్ లో కలిసిన విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఒకట డివిజన్ కైకొండాయి గూడెం, 59వ డివిజన్ దానావాయి గూడెంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కైకొండాయిగూడెంలో సుడా నిధులు రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అనంతరం 59వ డివిజన్లో సుడా నిధులు రూ.112.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, ఈ కాలంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు,

వార్తా లోపలి పేజీలో

○రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..
○ఖమ్మం కార్పోరేషన్ 1, 59వ డివిజన్ ప్రాంతాల్లో పర్యటన
○పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ..



# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

○నిమజ్జనం ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి
○గజ ఈతగాళ్లు, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ముందుగానే అందుబాటులో ఉంచాలి
○నిమజ్జనం పాయింట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 26 (జనంసాక్షి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు నది పరిసరాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశం, నీటి మట్టం, రహదారి మార్గాలు, వాహనాల రాకపోకలపై కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిమజ్జనం ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి ప్రజలకు అనువైన విధంగా

వార్తా లోపలి పేజీలో

# ఆర్టీసీ బస్సులకు అడ్డుగా రైల్వే అండర్‌పాస్‌లు

○రహదారి డబుల్ లేన్‌గా మారినా.. బస్సులకు మాత్రం బ్రేక్ ?
○గొందిగూడెం పరిసర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు..

అశ్వాపురం, ఆగస్టు 26 (జనంసాక్షి):
మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్న ప్రజల ఆశలకు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలు ప్రధాన అడ్డంకిగా మారాయి. అశ్వాపురం నుంచి గొందిగూడెం?మొండికుంట మీదుగా వెళ్లే రహదారిని డబుల్ లేన్‌గా అభివృద్ధి చేసినప్పటికీ, మార్గమధ్యంలోని రెండు రైల్వే అండర్‌పాస్‌ల ఎత్తు తక్కువగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో గతంలో సింగిల్ లేన్‌గా ఉన్న రహదారి డబుల్ లేన్‌గా అభివృద్ధి చెందడంతో గొందిగూడెం, రామవరం, భీమవరం, ఎలకలగూడెం, మామిళ్లవాయి, వెంకటాపురం, తుమ్మలచెరువు, కొత్తూరు, వేములూరు తదితర గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగుపడింది. అయితే రహదారి అభివృద్ధి జరిగినా అండర్‌పాస్‌ల సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి రాక ప్రజలు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యాన్ని పొందలేకపోతున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తే మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రైవేటు వాహనాలపై



ఆధారపడాల్సి వస్తుండటంతో

వార్తా లోపలి పేజీలో

# ఆదివారాల్లోనూ ఆధార్

ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు- 26 (జనంసాక్షి)**
ఖమ్మం జిల్లా ప్రజలకు మరింత సులభతరమైన, సమర్థవంతమైన ఆధార్ సేవలను అందించేందుకు స్థానిక మమత హాస్పిటల్ రోడ్,కవిరాజ్ నగర్ లో ఏర్పాటు చేసిన ఖమ్మం ఆధార్ సేవా కేంద్రం ను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్తగా ప్రారంభించిన ఖమ్మం ఆధార్ సేవా కేంద్రంలో ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారికి కొత్త ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్ అప్‌డేట్లు, బయోమెట్రిక్ అప్‌డేట్లు తదితర సేవలను మార్గదర్శకాల ప్రకారం అందించనున్నారు. కొత్త ఆధార్ నమోదు పూర్తిగా

మిగతా 2లో

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి



తుది నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం పాయింట్ల వద్ద అన్ని సౌకర్యాలునిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తగినంత లైటింగ్, బ్యారికేడ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు.నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రక్షణ పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జనం సమయంలో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.సమన్వయంతో పనిచేయాలి వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించి స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలని కోరారు.ఉత్సవ కమిటీలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ రామాంజనేయులు, ఇరిగేషన్ సీఈ వసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారాల్లోనూ ఆధార్ సేవలు..

ఉచితమని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ కేంద్రంలో ఆదివారాల్లో కూడా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీనివల్ల ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, ఇతర ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆధార్ సేవలను పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఖమ్మం ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం జిల్లాలో ఆధార్ సేవల బలోపేతానికి, పౌర కేంద్రిత డిజిటల్ సేవల విస్తరణకు మరో ముఖ్యమైన ముందడుగని మంత్రి అన్నారు. ప్రజలకు అవసరమైన గుర్తింపు సేవలను మరింత అందుబాటులోకి,సమర్థవంతంగా, సౌకర్యవంతంగా అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హైదరాబాద్ డైరెక్టర్ కె.ఎం. భారతి, అసిస్టెంట్ మేనేజర్ పి. రత్నాకర్, బీఎల్ఎస్ ఆధార్ సేవా కేంద్రం ప్రతినిధులు రీజినల్ మేనేజర్ కె. శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ దుగ్గి హరినాథ్, ఆపరేషన్స్ మేనేజర్ పి. సురేష్ కుమార్, ఇడిఎం దుర్గాప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల మన్ననలు పొందాలి

సూర్యాపేట (జనంసాక్షి):

వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఎదురుగా త్రివేణి ఫంక్షన్ హాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓం ఇంటీరియర్స్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఇంటికి వన్నె తెచ్చే ఇంటీరియర్ డిజైన్స్ పై నేడు ప్రతి ఒక్కరూ ఎక్కువ మక్కువ చూపుతున్నారని అన్నారు.ఇళ్ళు, ఆఫీసులు, కమర్షియల్ స్థలాలను అందంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంలో ఇంటీరియర్ డిజైన్ రంగం దూసుకుపోతుందని తెలిపారు.ఆధునిక సాంకేతికతో ఇంటీరియర్ డిజైనింగ్ నిపుణులు కూడా లైఫ్ మేడ్ ఈజీ ఇంటీరియర్స్ మీద దృష్టి పెట్టారని అన్నారు.ఇంటీరియర్ రంగంలో ఎంతో అనుభవం ఉన్న దేవీలాల్ సుతార్ నూతనంగా ఏర్పాటు చేసిన హోమ్ ఇంటీరియర్స్, మాడ్యులర్ ఫ్యాక్టరీద్వారా సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు లేటెస్ట్ ట్రెండ్ కు అనుగుణంగా ఇంటీరియర్ ఫర్నీచర్, కిచెన్ మాడ్యులర్ లలో నూతన డిజైన్లతో సేవలు అందించి వ్యాపారంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు రంగరాజు రుక్మారావు, అయిటిపాముల శ్రీనివాస్, ఏఎస్ఐ శంకర్,గుండా వెంకటేశ్వర్లు,మన్సూర్ ఆర్ట్స్, కమలేష్, అశోక్, సతీష్,యాదగిరి, పరుశురాములు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావంతో పండుగను జరుపుకోవాలి : టౌన్ ఏసిపి రమణమూర్తి

**ఖమ్మం, ఆగస్టు 26 (జనంసాక్షి)**






శాంతి, సామరస్యం, సోదరభావంతో మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోవాలని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు.మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశంఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పండుగను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు.మతపరమైన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఊరేగింపులు, ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు.మతాల మధ్య పరస్పర గౌరవం, సామరస్యం, సోదరభావాన్ని కాపాడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, రెచ్చగొట్టే లేదా మత విద్వేషాలను పెంచే పోస్టులను ప్రచారం చేయవద్దని, అలాంటి సమాచారాన్ని నమ్మకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ తరపున అవసరమైన బందోబస్తు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో శాంతి కమిటీ సభ్యులు, మత పెద్దలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ కరుణాకర్,బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

# కల్తీ ఆహారం.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- ○రెస్టారెంట్లు , హోటల్ వాళ్లతో “మిలాఖత్” అయిన “ఫుడ్ సేఫ్టీ” అధికారులు.
- ○చనిపోయిన కోళ్లు చాలా తక్కువ ధరకు రెస్టారెంట్లకు, హోటల్ లకు సప్లై..
- ○ఖమ్మం జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి: షేక్ బాజీ బాబా



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 26 (జనంసాక్షి)**

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రతి హోటల్, రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై ఉంది. అదే సమయంలో ఆ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులపై ఉందని, కానీ ఖమ్మం జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితనం ఏమాత్రం కూడా లేదని చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని,ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా ఆరోపించారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ,ఖమ్మం నగరంలో కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు లోపించాయని, కల్తీ నూనెలు, నాణ్యత లేని మసాలా పదార్థాలు, కల్తీ కారం, పసుపు, అల్లం వంటి పదార్థాలతో పాటు రంగులు, రుచిని పెంచే వివిధ రకాల ద్రావణాలను ఆహార తయారీలో ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. హోటళ్లు, రెస్టారెంట్లు చనిపోయిన కోళ్ళను కూడా తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ వ్యాపారం లాభం కోసం, తమ స్వలాభం కోసం, ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన అన్నారు.అదే వాస్తవంగా విషయం ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తెలుసు అని,ఆయన అన్నారు.తమ పార్టీ పరిశీలనలో అన్ని విషయాలు ఉన్నాయని ఆయన అన్నారు.ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే విషయాలను అధికారులు శాస్త్రీయంగా పరిశీలించి ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని,ప్రజలు ప్రతిరోజూ బయట ఆహారం తీసుకుంటున్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, విద్యార్థులు, వృద్ధులు, కుటుంబాలతో బయట భోజనం చేసే వారు నాణ్యత విషయంలో ఆందోళన చెందుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపార ప్రయోజనాల కోసం ఎవరూ చెలగాటం ఆటలాడకూడదని ఆయన అన్నారు.

ఖమ్మం నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని,

వంట నూనెలు, కారం, పసుపు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, ఇతర మసాలా పదార్థాలు, ఆహార తయారీలో ఉపయోగించే రంగులు మరియు ద్రావణాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని,

నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానం, వంటగది పరిస్థితులను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులపై ఉందని ఆయన అన్నారు. ప్రజలకు అనుమానాస్పదమైన లేదా కల్తీ ఆహారం విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించే విధంగా ఫిర్యాదు వ్యవస్థను బలోపేతం చేయాలి.తనిఖీలు నిర్వహించిన వివరాలు, తీసుకున్న చర్యలపై అధికారులు పారదర్శకంగా ప్రజలకు సమాచారం ఫుడ్ సేఫ్టీ అధికారులపై ఉందని ఆయన అన్నారు. కేవలం పండుగలు లేదా మీడియా దృష్టి ఉన్న సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలి.మేము హోటళ్లకు లేదా ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారులకు వ్యతిరేకం కాదు. వ్యాపారం చేసుకునే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి అనేదే మా డిమాండ్.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వానికి, అధికారులకు, వ్యాపారులకు సమిష్టి బాధ్యత. ఈ విషయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. కల్తీ ఆహారాన్ని అరికట్టాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార కల్తీపై మా పోరాటం కొనసాగుతుంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజా ప్రయోజనాల కోసం తదుపరి కార్యాచరణను చేపడతామని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ తరపున తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.

# మాడుగులపల్లిలో పసికూనలతో వెట్టిచాకిరీ

## వి ఎస్ గార్డెన్స్‌లో నిబంధనలకు పాతి బాలలతో పనులు

## అధికారులకు పట్టని వైనం పట్టించుకోకపోవడంపై కుల సంఘాల ఆగ్రహం

**మాడుగులపల్లి ఆగస్టు 26 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని వి ఎస్ గార్డెన్స్‌లో చట్టాలను, నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ బాల కార్మికులతో యథేచ్ఛగా పనులు చేయిస్తుండటం తీవ్ర కలకలం రేపుతోంది ఫంక్షన్ హాళ్లలో బాలలతో వెట్టి పనులు చేయించవద్దన్న స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు

**తక్కువ కూలీ.. ఎక్కువ శ్రమ!**

సోమవారం నిర్వహించిన ఒక వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో డైనింగ్ హాల్‌లో చిన్నారులతో ప్లేట్లు వేయించడం, నీళ్లు పోయించడం వంటి పనులను చేయించారు తక్కువ కూలీలకే దొరుకుతున్నారనే దురాశతో, నిర్వాహకులు బాలల భవిష్యత్తును చిదిమేస్తూ తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని పలు కుల సంఘాల నాయకులు మండిపడ్డారు.




**లోఅధికారుల నిర్లక్ష్యంపై నిరసన**

ఫంక్షన్ హాల్‌లో బాల కార్మికుల వ్యవస్థ కొనసాగుతోందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, వారు కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల ఉదాసీనత వల్లే నిర్వాహకులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు

**కఠిన చర్యలు తీసుకోవాలి**

నిబంధనలను గాలికి వదిలేసి, బాలల హక్కులను కాలరాస్తున్న వి ఎస్ గార్డెన్స్ నిర్వాహకులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు,లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఆర్టీసీ బస్సులకు అడ్డుగా రైల్వే అండర్‌పాస్‌లు

ప్రయాణ భారం కూడా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అండర్‌పాస్‌ల ఎత్తు పెంచాలని డిమాండ్:**

రైల్వే శాఖ అధికారులు సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు అండర్‌పాస్‌ల ఎత్తు పెంచడంతో పాటు అవసరమైన మేరకు వాటిని విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్సులు సులభంగా రాకపోకలు సాగించే విధంగా నూతన నిర్మాణాలు చేపట్టి, ఇందుకు అవసరమైన నిధులు, సాంకేతిక మరియు ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వం, రైల్వే శాఖ, సంబంధిత రోడ్డు?రవాణా శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టి అండర్‌పాస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేలా పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# ఘనంగా మహిళా సమానత్వ దినోత్సవ వేడుకలు

## ఉదయ్ హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో మహిళా రైతు కూలీలకు లంచ్ బ్యాగు బాక్సుల పంపిణీ



**ఆత్మకూర్ (ఎం) ఆగస్టు (26) జనంసాక్షి**

మండలం లో ని కూరెళ్ల గ్రామం లో మహిళా సమానత్వ దినోత్సవ వేడుకలు ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ కోణంలో ముందుకెళ్లాలని మహిళా చైతన్యం ఫరిడవిల్లే విధంగా ఉండాలని కోరుతూ ఎరుకల ఉదయ్ భాస్కర్ అన్నారు. తన తల్లిదండ్రులు ఎరుకుల కృష్ణమూర్తి- పద్మల గౌరవార్థం కూరెళ్ల గ్రామంలో లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ కూడా లంచ్ బ్యాగు,బాక్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదే క్రమంలో గ్రామంలో ఉన్న మహిళలకి ఒక్కొక్కరిగా బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. తర్వాత హెల్పింగ్ హాండ్స్ వారి ఫౌండేషన్ కుటుంబీకులను గ్రామ పార్టీ అఖిలపక్ష నాయకులు, గ్రామ మహిళా సంఘం సభ్యులు అందరూ కూడా ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం ముత్తమ్మ,ఉప సర్పంచ్ రమేష్, వార్డు మెంబర్లు మరియు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# తాడూరి నాగమ్మ మృతి పార్టీకి తీరని లోటు

## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్

**నూతనకల్ ఆగస్టు 26(జనంసాక్షి)**



తాళ్ల సింగారం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తాడూరి సైదులు అమ్మ తాడూరి నాగమ్మ అకాల మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు.ఆమె పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ మండల నాయకులు ఆమె కుమారుడు తాడూరి సైదులు మరియు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలు గౌడ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న గౌడ్, మాజీ సర్పంచ్ చుడి లింగారెడ్డి రేసు వెంకటేశ్వర్లు బత్తుల విద్యాసాగర్, జటంగి శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దోరకుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తీవ్రగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి..
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం..

**కోదాడ,( జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోర కుంట సమీపంలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి తీవ్ర గ్భ్రాంతి వ్యక్తం చేశారు.కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం సంభవించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికుల జీవితాలు మార్గమధ్యంలోనే విషాదాంతం కావడం హృదయవిదారకమని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఈ అపార విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ సకాలంలో అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చికిత్స విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆకాంక్షించారు.

# విద్యుత్ షాక్ తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## యల్క సోమయ్య గౌడ్

**హుజూర్ నగర్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వెన్నబోయిన ఉదయ్ (33) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటనపై నిరసనగా ఆగస్టు 27న హుజూర్ నగర్ పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల బంద్‌కు పిలుపునిచ్చినట్లు శిల్పకళా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం టౌన్ అధ్యక్షులు యల్క సోమయ్య గౌడ్ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ మార్కెట్ పరిధిలోని ఇంటి నిర్మాణం వద్ద ప్లాస్టింగ్ పని చేస్తుండగా ఉదయ్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. ఉదయ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఉదయ్ ఆకస్మిక మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవా



లని, తగిన ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల ద్వారా కుటుంబానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని యల్క సోమయ్య గౌడ్ డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా నిర్మాణ ప్రదేశాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ఆగస్టు 27న జరిగే బంద్‌కు భవన నిర్మాణ కార్మికులు, కార్మిక వర్గం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొమ్మాల గ్రామం లో కళాకారుల పాటల ద్వారా అవగాహన కార్యక్రమం

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి) :** కొమ్మాల గ్రామంలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఆట, పాట, మాట ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వన మహోత్సవం, గంజాయి, డ్రగ్స్, పరిసరాల పరిశుభ్రత, ఆరుతడి పంటలపై ప్రజలకు ఆటపాట మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారథి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు, మేడిపల్లి వేణు, శంకర్, లక్ష్మి, రాధ, శిరీష గ్రామస్తులు పాల్గొన్నారు.



జనంసాక్షి

### కేంద్ర ప్రభుత్వ పాలనలో..

# ప్రజా హక్కులకు తీవ్ర విఘాతం..!

○రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలిః ప్రొఫెసర్ లక్ష్మణ్

○ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఉద్యమాలు అవసరంః ఎన్. నారాయణ

○ఖమ్మంలో సిఎల్‌సి 18వ మహాసభ ప్రారంభం

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 26(జనంసాక్షి)**

కేంద్ర ప్రభుత్వ విధానాలు, పాలనా నిర్ణయాల ఫలితంగా దేశంలో ప్రజల ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోందని పౌర హక్కుల సంఘం (సిఎల్‌సి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, గౌరవప్రదమైన జీవన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. బుధవారం ఖమ్మం పట్టణంలోని స్థానిక టిపిటిఎఫ్ కార్యాలయంలోని అమరుడు రామనాథం ప్రాంగణం మీటింగ్ హాల్‌లో సిఎల్‌సి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉపేందర్ అధ్యక్షతన పౌర హక్కుల సంఘం 18వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎన్. నారాయణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం పౌరులకు అనేక ప్రాథమిక హక్కులను కల్పించిందని, ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి వ్యక్తికి జీవించే హక్కుతో పాటు గౌరవప్రదమైన జీవనానికి రక్షణ కల్పిస్తుందని వారు వివరించారు. అయితే పాలకుల విధానాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజా వ్యతిరేక చర్యల కారణంగా ఈ హక్కులు అనేక సందర్భాల్లో ఉల్లంఘనకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల స్వేచ్ఛను, భావ ప్రకటనా హక్కును, ప్రశ్నించే హక్కును, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు పౌర హక్కుల ఉద్యమాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం పౌర సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.



అమరులకు నివాళి..

మహాసభ ప్రారంభానికి ముందు ప్రజా హక్కుల ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. ప్రజాస్వామ్య, పౌర హక్కుల పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలను వక్తలు స్మరించుకున్నారు. ఈ సభలో సిఎల్‌సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రవి, రాష్ట్ర కోశాధికారి విప్లవకుమార్ తదితరులు ప్రసంగించారు. పౌర హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల అమలు తదితర అంశాలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

**పాటలతో చైతన్యం..!**

మహాసభలో అరుణోదయ కళాకారులు ప్రజా సమస్యలు, హక్కులు, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే పాటలను ఆలపించారు. వారి గేయాలు సభకు హాజరైన



ప్రతినిధులను ఆలోచింపజేశాయి. పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు.

సిఎల్‌సి 18వ మహాసభల్లో పౌర హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ప్రజల సమస్యలు రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనే తదితర అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ప్రజల హక్కులకు భంగం కలిగించే విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత విస్తృతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.

## రామలింగేశ్వర దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం రావడం పట్ల హర్షం

**సూర్యాపేట(జనంసాక్షి):**



జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయస్వామి వారి దేవాలయంకు దక్షిణ భారత దేశంలో ప్రముఖ దేవాలయాలకు మహాశాస్త్ర సేవా సంఘం అందించే ప్రతిష్ఠాత్మకమైన అన్నపూర్ణ పురస్కారం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఆ దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అనంతుల రామలింగయ్య సాలమ్మ దంపతుల ఆధ్వర్యంలో 1979లో శివాలయ నిర్మాణం జరిగిందన్నారు.ఆ తర్వాత 2007లో దేవాలయ ధర్మకర్తలు,భక్తుల సహకారంతో త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయస్వామి వారి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.నాటి నుండి దేవాలయంలో భక్తుల సహకారంతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఎంపిక చేసిన 12 దేవాలయాల్లో రామలింగేశ్వర దేవాలయం ఉండటం గర్వకారణమని అన్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ కుమార్ శర్మకు కూడా గురుపురస్కారం అందజేయటం హర్షనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, దేవాలయ ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్ గౌడ్,సందీప్, యుగేందర్, శివ, సుజాత, హంసవేణి, తెల్ల ప్రభాకర్, ఉపేందర్ రావు, వాసుదేవరావు, పెద్దిరెడ్డి భరత్, తోట శ్యాంప్రసాద్ రాజయ్య, భాస్కర్,చల్లా లక్ష్మీకాంత్,నాగుబండి లక్ష్మీకాంత్, అర్చకులు దుర్గాప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన బాధ్యత..

### పచ్చదనం కోసం గ్రామస్థుల స్వచ్ఛంద బాట

**నేరేడుచర్ల, ఆగస్టు 26 (జనంసాక్షి)**



పర్యావరణ పరిరక్షణతో పాటు తమ గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో నేరేడుచర్ల మండలం గంటవారిగూడెం గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సుమారు రూ. 40 వేల సొంత నిధులతో అశోక మొక్కలను కొనుగోలు చేసి, గంటవారిగూడెం నుంచి సోమారం ఆర్అండ్‌బీ రోడ్డు వైపు సుమారు కిలోమీటరు మేర రహదారి వెంట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా సొంత నిధులు సమకూర్చుకుని పచ్చదనం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో వల్లంచెట్ల లచ్చయ్య, జ్యోతిబాబు, బచ్చలకూరి ప్రకాశ్, తాళ్ల సురేష్‌రెడ్డి, తొట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గేమింగ్ జోన్ ల వల్ల మానసిక ఉల్లాసం

**సూర్యాపేట(జనంసాక్షి):**

జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో హోటల్ శ్రీ గ్రాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఆర్ గేమింగ్ జోన్ ను బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఆర్ గేమింగ్ జోన్ నిర్వాహకులు షేక్ రసూల్ మాట్లాడుతూ గేమింగ్ జోన్ వల్ల మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతుందన్నారు.ఈ ఆటల వల్ల రోజు వారి పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని అన్నారు.తాము నూతనంగా ప్రారంభించిన ఏఆర్ గేమింగ్ జోన్ లో వర్చువల్ రియాలిటీ, స్కిల్ బేస్డ్ గేమ్స్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.వర్చువల్ రియాలిటీ ఎక్స్పీరియన్స్ తో పీఎస్ 4, పీఎస్ 5 గేమ్స్ ఆడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ అహ్మద్, షేక్ అహమ్మద్, రసూల్, సాధిక్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో గ్రామ సభలే కీలకం..!

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 26(జనంసాక్షి)**

ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు గ్రామ సభలే కీలకమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించనున్నారని, వాటిల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఓటర్ల ముసాయిదా జాబితాను చదివి వినిపిస్తారని తెలిపారు. అదే విధంగా తొలగించిన ఏ ఎస్ డి డి (ఆచూకీ దొరకని, వలస వెళ్లిన, మృతి చెందిన,డూప్లికేట్) ఓటర్ల వివరాలను కూడా చదువుతారన్నారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం అనామలీస్ , నో మ్యాపింగ్ కింద 1,76,135 మంది ఓటర్లకు, ఖమ్మం నియోజకవర్గం లోని 65,276,పాలేరు నియోజకవర్గం లోని 40,698, మధిర నియోజకవర్గం లోని 27,834, వైరా నియోజకవర్గం లోని 22,101,సత్తుపల్లి నియోజకవర్గం లోని 20,226 మంది ఓటర్లకు ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు ఇవ్వనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమం అంతా ప్రజల, బూత్ లెవెల్ ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల సంఘం అధికారులు చదివి వినిపిస్తారని, ఎటువంటి పొరపొచ్చాలు జరిగినా బూత్ లెవెల్ ఏజెంట్లు ఈ గ్రామ సభలను అత్యంత ప్రాధాన్యత గా తీసుకొని తక్షణమే స్పందించాలన్నారు. బోగస్ ఓట్లు, తదితర అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా గ్రామ సభల్లో ఫారం -6,ఫారం -7, ఫారం-8 అందుబాటులో ఉంచుతారు కావున బూత్ లెవెల్ ఏజెంట్లు గ్రామంలోని ముఖ్య నాయకులతో కలిసి గ్రామ సభలో విధిగా పాల్గొనాలని ఉపదేశించారు. అదే విధంగా బూత్ లెవెల్ సూపర్ వైజర్ (మండల, పట్టణ అధ్యక్షులు) లు మీ పరిధిలోని అన్ని బూత్ లలోని గ్రామ



సభలలో బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి ప్రత్యక్షంగా పాల్గొనాలని తద్వారా అర్హత గల ప్రతి పౌరుని ఓటు ఓటర్ జాబితా లో ఉండేలా చేయాలన్నారు.

# సైడ్ డ్రైన్ నిర్మాణం అస్తవ్యస్తం

- ఇబ్బంది పడుతున్న కుటుంబం వర్షం వస్తే ఇంట్లోకి వస్తున్న నీరు
- సమస్య పరిష్కరించాలంటూ పురుగుమందు డబ్బాతో రోడ్డు ఎక్కిన బాధితులు



**కల్లూరు ఆగస్టు 26 (జనంసాక్షి):** ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సైడ్ డ్రైన్ నిర్మాణం అధికారులు, ఇష్టానుసారంగా నిర్మించడంతో నీరు ముందుకు పోక వర్షం వస్తే ఇంట్లో నీరు చేరి ఇబ్బంది పడుతున్న కుటుంబం బుధవారం రోడ్డెక్కి రాస్తారోకో చేసిన ఘటన కల్లూరు మండలంలో జరిగింది. మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామంలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టి డ్రైనేజీ కాలువల నిర్మాణం అడ్డం వచ్చిన దగ్గర గోడలు పగలగొట్టి సైడ్ నిర్మాణం చేపట్టారు. సల్వాది నరసింహారావు ఇంటి గోడ సైతం పడగొట్టి డ్రైనేజీ కట్టారు ఆ ఇల్లు దాటిన తర్వాత మరో నాయకుడు ఇల్లు రావడంతో సైడ్ డ్రైన్లో ఇంటికి ఉన్న రింగుమెంట్లు ఉండటంతో ఆయన పగల గొట్టడానికి అడ్డం తిరగటంతో ఆర్ అండ్ బి అధికారులు పైప్ లైన్ వేసుకోవడానికి అనుమతించారు. అక్కడ వరకు వెడల్పుగా ఉన్న డ్రైన్ అండర్ గ్రౌండ్ పైప్ వేసుకోవటంతో డ్రైన్లు వచ్చే నీరు అందులోకి పోక పోటేసి ఆ నీరు కాలువలో నుంచి పైకి వచ్చి ఇంట్లోకి వచ్చాయని దీంతో తామేళా జీవించాలంటూ అధికారు లకు విన్నవించుకున్న పట్టించుకోకపోవడం తో మధిర రహదారిపై సల్వాది నరసింహారావు దంపతులు పురుగుమందు డబ్బా పెట్టుకొని రోడ్డుపై బేటాయించి రాస్తారోకో చేశారు. సమస్య పరిష్కరించక పోతే ఇక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదనతో చెప్పారు. గ్రామ ప్రజలు కూడా ఇది న్యాయమైన సమస్య పరిష్కరించాల్సిందే నని దంపతులకు మద్దతు పలికారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియడంతో పోలీసులు అక్కడ చేరుకొని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడతామని ఇబ్బంది తొలగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో భార్యాభర్తలు చేస్తున్న రాస్తారోకో ను విరమించారు. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి శాఖ ఏఈ దృష్టికి తీసుకోవడంతో తాను గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా చూస్తానని పోలీసులుకు చెప్పినట్టు తెలిసింది.

# మేడి నరసింహారావు అదృశ్యం..

## ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**అశ్వరావుపేట, ఆగస్టు 26 (జనంసాక్షి):**
అశ్వరావుపేట మండలం నారంవారిగూడెం కాలనీ (బురుగుగుంపు) గ్రామానికి చెందిన మేడి నరసింహారావు (38?40) అదృశ్యమైనట్లు ఆయన భార్య మేడి సావిత్రి అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. నరసింహారావు పామాయిల్ గెలలు కటింగ్ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి సుమారు 8 గంటల సమయంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. తన సెల్‌ఫోన్‌ను సైతం ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు తెలిపారు. బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులను ఆశ్రయించింది.అదృశ్యమైన వ్యక్తి వివరాలు:మేడి నరసింహారావు, వయస్సు 38?40 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామన ఛాయ. చివరిసారిగా లైట్ బ్లూ (స్కై బ్లూ) గళ్ల చొక్కా, తెలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.నరసింహారావు ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్?100కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# తాటి పుల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన నేతలు



**కారేపల్లి, ఆగస్టు 26,( జనంసాక్షి):**
తుడుం దెబ్బ జిల్లా నాయకులు తాటి పాపారావు, రామారావు ల మాతృమూర్తి తాటి పుల్లమ్మ ఇటీవల మృతి చెందారు ఆమె సంస్మరణ కార్యక్రమం బుధవారం కారేపల్లి మండలం పోలంపల్లి జరిగింది ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు హాజరై పుల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యురాలు పోలంపల్లి సర్పంచ్ ధారావత్ హేమలత బాలాజీ మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్, ఎర్రబోడు మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ మూతి కోటయ్య, వార్డు సభ్యులు రమేష్, చందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కళ్యాణ్, రవి, టీచర్ రాంబాబు కుటుంబ సభ్యులు లక్ష్మి హైమావతి తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ గుడి నిర్మాణం కి సహకరిస్తా..

## మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

**తిరుమలాయ పాలెం ఆగస్టు 26 జనం సాక్షి**
తిరుమలాయ పాలెం మండల కేంద్రంలో ఎస్సీ మాదిగల ఆరాధ దైవం దైవం ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి మర్యాదగాపూర్వ కలిసి ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలని తిరుమల పాలానికి చెందిన దళితుల విన్నవించుకోగా వెంటనే పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి ముత్యాలమ్మ గుడికి నిర్మాణానికి సహకరిస్తారని హామీ ఇచ్చారు నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కొంబో వీరబాబు పోలపొంగ బక్కయ్య బచ్చలకూర సోమయ్య ఎస్సీ మాదిగ కాలనీకి చెందిన పెద్దలు కొమ్ము బుచ్చి రాములు కొమ్ము కుటుంబారావు ఇస్తారు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వజ్జే వినయ్

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 26 (జనంసాక్షి)**



తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రామన్నగూడెం గ్రామానికి చెందిన వజ్జె వినయ్ యాదవ్ రెండవసారి ఎన్నికయ్యారు. గతంలోనే జీఎం పీ ఎస్ లో వినయ్ యాదవ్ పలు పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకం దారులకు 50 శాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, 50 ఏళ్ళు నిండిన వారికి 5వేల రూపాయల పింఛన్ చెల్లించాలని కోరారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి 'సహృదయ' ఆపన్నహస్తం..

## - బ్రెయిన్ ఆపరేషన్ కోసం రూ.20 వేల తక్షణ సాయం..

**బూర్గంపహెడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**






రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ యువకుడికి సహృదయ సేవా ఫౌండేషన్ దన్నుగా నిలిచింది. అత్యవసర బ్రెయిన్ సర్జరీ కోసం ఆపన్నహస్తం అందించి మానవత్వాన్ని చాటుకుంది. మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన పాండవుల మహేష్ వ్యక్తిగత పనిపై నల్గొండకు వెళ్లిన సమయంలో తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ దుర్ఘటనలో మహేష్ తలకు బలమైన గాయం కావడంతో, వైద్యులు అత్యవసరంగా మెదడు శస్త్రచికిత్స (బ్రెయిన్ ఆపరేషన్) చేయాలని సూచించారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులు భరించలేక కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.ఈ పరిస్థితిని తెలుసుకున్న సహృదయ సేవా ఫౌండేషన్ చైర్మన్ సునీత, సభ్యులు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ వైద్య ఖర్చుల నిమిత్తం ఫోన్‌పే ద్వారా తక్షణమే రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్లిష్ట సమయంలో తమను ఆదుకున్న ఫౌండేషన్ నిర్వాహకులకు మహేష్ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. మహేష్ ప్రాణాలు కాపాడేందుకు మరింత చికిత్స అవసరమని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఆర్థికంగా సహకరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు పిలుపు



**తిరుమలాయపాలెం ఆగస్టు 26 జనంసాక్షి :** సిపిఐ ఎంఎల్ న్యూడేమోక్రసీ జిల్లా కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లు ఐస్కారణ సందర్భంగా వి కోటేశ్వరరావు మాట్లాడుతూ భారత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభన స్థితిని ఎదుర్కొంటుందని దీనంతటికీ కారణం భారత సామాజిక వర్గాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు సరళీకరణ ఆర్థిక విధానాలే కారణమని ఆయన అన్నారు భారత ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ పోరాటాల సందర్భంగా ఇచ్చినటువంటి ఆమేలను అమలు చేసే కార్యాచరణ ఎంతవరకు చేపట్టకపోవడం రైతన్న ఎడల వారికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది అనేక సామ్రాజ్యవాద దేశాలతో పాలకవర్గాలు చేసుకుంటున్న అసమాన ఒప్పందాలకు మూలముగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావట్లేదని లేదా కనీసం మద్దతు ధర రావటం లేదంటూ దీనంతటికీ భారత ప్రభుత్వం 32 దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలు ముఖ్యంగా అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు రైతాంగానికి గుదిబండలుగా మారబోతున్నాయని తక్షణమే ఈ అసమాన ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు బహుళ జాతి కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న విత్తనాల వలన రైతాంగం తీవ్ర నష్టం జరుగుతుంది నకిలీ విత్తనాలు హైవే కాకుండా పర్మిషన్ లేకుండా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందని దీని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది రాబోయే మహాసభలో భారత రైతుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొని బలమైన రైతు కూలి ఉద్యమాన్ని నిర్మించి పాలకుల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రకాష్ వెంకటరామిరెడ్డి మందుల రాజేంద్రప్రసాద్ గిరీ షేక్ ఖాసీం సుదర్శన్ పరకాల లక్ష్మి జానకి మోహన్ రావు సంగక్క మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


# పెళ్లి పేరుతో మోసం

## - యువతిని గర్భవతిని చేసిన సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు..

**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**
ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువతిని నమ్మించి గర్భవతిని చేసి, మరో మహిళను వివాహం చేసుకున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) కానిస్టేబుల్‌పై బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.బూర్గంపహెడ్ మండల కేంద్రానికి చెందిన సాయికుమార్ సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను గత మూడేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సదరు యువతి గర్భవతి అయ్యింది. అయితే, బాధితురాలికి తెలియకుండా నిందితుడు సాయికుమార్ ఇటీవల వేరే మహిళను వివాహం చేసుకున్నాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు న్యాయం చేయాలని కోరుతూ బూర్గంపహాడ్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై మేడా ప్రసాద్ నిందితుడు సాయికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రాజకీయ పోరులో ఎవరు గెలిచినా..

# నష్టపోయేది ప్రజలే!




**విమర్శలు, ప్రతి విమర్శలకే పరిమితమైతే నష్టపోయేది ప్రజలే.. అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష..**

**అశ్వాపురం, ఆగస్టు 26 (జనంసాక్షి):** పినపాక నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మధ్య రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు మరోసారి హాట్‌టాపిక్‌గా మారాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రేగా కాంతారావు మణుగూరులో నిర్వహించిన ర్యాలీ, అనంతరం కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘాటుగా స్పందించడంతో నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కాయి. అయితే ఇద్దరు కీలక నేతలు రాజకీయ పోరులోనే ఎక్కువ సమయం కేంద్రీకరిస్తే అసలు ప్రజా సమస్యలు పక్కదారి పట్టే ప్రమాదం ఉందని ప్రజల్లో చర్చ సాగుతోంది.

**రాజకీయ పోరులో నష్టపోయేది ప్రజలే?**

నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు సహజమే అయినప్పటికీ అవి వ్యక్తిగత స్థాయికి చేరితే ప్రజా సమస్యలు వెనుకబడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి తదితర సమస్యలపై ప్రజలు పరిష్కారం కోరుతుంటే.. నాయకులు మాత్రం పరస్పర ఆరోపణలు, రాజకీయ ఆధిపత్యంపై దృష్టి పెట్టడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు పెద్ద నాయకులు బాహాబాహీకి దిగితే చివరికి రాజకీయంగా ఎవరు లాభపడినా.. నష్టపోయేది మాత్రం నియోజకవర్గ ప్రజలేనని, అందువల్ల ప్రజా సమస్యల పరిష్కారానికి ఇద్దరూ పోటీ పడాలని ప్రజలు కోరుతున్నారు.

**కేసు వ్యవహారంపై వాస్తవాలు ప్రజలకు చెప్పాల్సిందే:**

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన కేసు వ్యక్తిగత అంశమైనప్పటికీ.. ప్రజా జీవితంలో ఉన్న నాయకుడిగా దాని నేపథ్యం, తన వాదన, హైకోర్టు తీర్పుపై తన అభిప్రాయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై మీడియా సమక్షంలో వాస్తవాలను వివరించి ఉంటే ప్రజలకు పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉండేదని అంటున్నారు. అదేవిధంగా హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేసుకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించడం ద్వారా తనపై ఉన్న సందేహాలకు సమాధానం చెప్పే అవకాశం రేగా కాంతారావుకు ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**పాయం కౌంటర్.. కాంగ్రెస్‌కు సంబంధం లేదని స్పష్టం:**

మరోవైపు రేగా కాంతారావుపై నమోదైన కేసుతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఒక మహిళ చేసిన ఫిర్యాదును రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపైకి మళ్లించడం సరికాదని ఆయన ఖండించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలోనూ వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఇద్దరి రాజకీయ అనుభవం.. నియోజకవర్గానికి ఉపయోగపడాలి:**

రేగా కాంతారావు గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయడంతో పినపాక రాజకీయాల్లో ఆయనకు గుర్తింపు ఉంది. మరోవైపు ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ప్రత్యేక ముద్ర వేశారనే అభిప్రాయం ఉంది. గతంలోనూ పినపాక రాజకీయాల్లో పాయం వర్సెస్ రేగా అనే పోటీ ప్రధానంగా కనిపిస్తూ వచ్చింది. అయితే ఇద్దరు అనుభవజ్ఞులైన నాయకులు తమ రాజకీయ శక్తిని పరస్పర విమర్శలకు కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి వినియోగిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**అభివృద్ధిపై పోటీ పడాలి:**

ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ పినపాకలో రాజకీయ వేడి పెరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ రాజకీయ బలాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఈ రాజకీయ పోటీ ప్రజా సమస్యల పరిష్కారంలోనూ కనిపించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు ఎన్ని ఉన్నా.. చివరికి ప్రజల కోసం పనిచేసే నాయకత్వమే నిలుస్తుంది. పాయం?రేగా రాజకీయ పోరాటం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించకుండా.. నియోజకవర్గానికి నిధులు, అభివృద్ధి, సంక్షేమం తీసుకురావడంలో పోటీగా మారాలని పినపాక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

---

### నేడు కలెక్టరేట్ ముందు జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

**తుంగతుర్తి ఆగస్టు 27 (జనంసాక్షి) :** ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు నేడు కలెక్టరేట్ ముందు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని టిఎ పి ఆర్ పి ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం యాదగిరి అన్నారు, బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్లకు రావలసిన పి.ఆర్.సి ఆరు డి ఏ లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, హెల్త్ కార్డు కొరకు మూడు మాసాల నుండి బేసిక్ లో కోతలు విధిస్తున్నారని అన్నారు, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు, ఇలాంటి సమస్యలపై తెలంగాణ ఎంప్లాయిస్ ఇచ్చిన పిలుపుమేరకు ఉపాధ్యాయులు ఉద్యోగులు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు,

---

## జిప్సీ అనాధ ఆశ్రమంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు

**- డిఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు**

**హుజూర్‌నగర్, ఆగస్టు 26 (జనంసాక్షి) :**

డిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో జిప్సీ అనాధ ఆశ్రమంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా వారు మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనాధ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని చాటి చెప్పిన మానవతా మూర్తి మదర్ థెరిసా. దేశం కాని దేశం వచ్చి తల్లిదండ్రులు లేని అభాగ్యులను అక్కున చేర్చుకుని కన్నతల్లిలా సేవ చేసిన మహనీయురాలు. భారతరత్న గ్రహీత అయిన ఆమె కలకత్తా మురికివాడల్లో అనాథ పిల్లలకు చదువు చెప్పడంతో పాటు వికలాంగులకు, రోగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవ చేశారు. అనాథలకు ప్రేమను పంచారు అని కొనియాడారు. సాయం చేయడానికి ఉండాల్సింది డబ్బు కాదు మంచి మనసు అని, ఆ స్ఫూర్తితోనే డి ఎస్ ఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు అలవాల నరేష్, జిప్సీ అనాధ పిల్లల ఆశ్రమం అధ్యక్షుడు ధన్ పాల్, చిల్డ్రన్స్ తదితరులు పాల్గొన్నారు.



---



# సర్వర్ మొరాయింపు

### రేషన్ బియ్యం కోసం ఇరవెండి గ్రామస్తుల పడిగాపులు

### గడువు పొడిగింపునకు చర్యలు తీసుకుంటాం: డీటీ హామీ

**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండగా, సాంకేతిక సమస్యలు లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయతీ రేషన్ షాపు వద్ద సర్వర్ మొరాయించడంతో బియ్యం అందక లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. రేషన్ పంపిణీకి ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రచారం జరగడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు వెంటనే స్పందించి బూర్గంపహాడ్ డిప్యూటీ తహసీల్దార్‌ను గ్రామానికి రప్పించారు. రేషన్ షాపు వద్ద నెలకొన్న రద్దీ, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయనకు ప్రత్యక్షంగా చూపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ బియ్యం అందే వరకు పంపిణీ ప్రక్రియను ఆపవద్దని ప్రజాప్రతినిధులు అధికారులను గట్టిగా కోరారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ.. సర్వర్ సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, లబ్ధిదారులు ఎవరూ నష్టపోకుండా రేషన్ పంపిణీ గడువును పొడిగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

---

## పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ, వసతి

**- బూర్గంపహాడ్ ఎస్ ఐ మేడా ప్రసాద్ ప్రకటన**



**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**

రాష్ట్రంలో త్వరలో వెలువడనున్న నూతన కానిస్టేబుల్, ఎస్సై రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి (రెసిడెన్షియల్) సౌకర్యం కల్పించనున్నట్లు బూర్గంపహాడ్ ఎస్ ఐ మేడా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే స్థానిక అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారమ్‌లను పూర్తి చేసి, ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ సెప్టెంబర్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన వారికి మాత్రమే ఉచిత వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదల గల స్థానిక యువతీ యువకులందరూ ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్ ఐ మేడా ప్రసాద్ కోరారు.

---

### ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొట్టే ప్రదీప్ ఏకగ్రీవ ఎన్నిక..



**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొట్టే ప్రదీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బూర్గంపహా?డ్ లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఉద్యోగులంతా ముక్తకంఠంతో ఆయనను నూతన సారథిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొట్టే ప్రదీప్ మాట్లాడుతూ ? ఆరోగ్యశ్రీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే ధ్యేయంగా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని భరోసా ఇచ్చారు. తన నాయకత్వంపై విశ్వాసముంచి, జిల్లా అధ్యక్ష బాధ్యతలను ఏకగ్రీవంగా అప్పగించిన ఉద్యోగ మిత్రులందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదీప్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

### మద్యం సిండికేట్‌పై కొరవడిన

# అధికారుల నిఘ

## రోజుకు రూ.లక్షల్లో అదనపు ఆదాయం వస్తోందని ఆరోపణలు..







**కారేపల్లి, ఆగస్టు 26,(జనంసాక్షి):** సింగరేణి మండల కేంద్రంలో మద్యం సిండికేట్ వ్యవహారం జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైన్ షాప్ కేంద్రంగా మద్యం విక్రయాలు సాగుతున్న తీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సిండికేట్ ద్వారా రోజుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అదనపు ఆదాయం వస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. మద్యం దుకాణాల సమయాలు ముగిసిన తర్వాత కూడా విక్రయాలు సాగుతున్నాయా? బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా అవుతోందా? అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా? అన్న అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**ఫిర్యాదులు వెళ్లినా స్పందనేదీ?**

కారేపల్లిలో జరుగుతున్న మద్యం సిండికేట్ వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులకు పలువురు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు సమాచారం. అయినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే ఉన్నతాధికారులు, ఎక్సైజ్ కమిషనర్ స్థాయిలో విచారణ చేపట్టి సిండికేట్ ఆరోపణలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. కారేపల్లిలో మద్యం సిండికేట్ దందాపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? ఫిర్యాదులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనే ప్రజల ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానం చెప్పాలి



## నిరుద్యోగ యువతీ యువకులకు ముఖ్య ప్రకటన

**అశ్వరావుపేట, ఆగస్టు 26 (జనంసాక్షి):** అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ శాఖ ముఖ్య ప్రకటన విడుదల చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు త్వరలో వెలువడనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్, ఉచిత రెసిడెన్షియల్ ఫెసిలిటీ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని పొందాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిగా నింపి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అశ్వరావుపేట పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు సెప్టెంబర్ 6వ తేదీన ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు ఉచిత రెసిడెన్షియల్ ఫెసిలిటీ కల్పించి, పోలీస్ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాల సాధనకు సిద్ధం కావాలని అశ్వరావుపేట ఎస్ఐ యాయాతి రాజు కోరారు. అభ్యర్థులు నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.



## మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత - డీఎస్పీ అరుణ్‌కుమార్..

**భద్రాచలం ఆగస్టు 26 (జనంసాక్షి)**

భద్రాది కొత్తగూడెం జిల్లా :- మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణంను మనం కాపాడితే మనకు మంచి చేకూరుతుందని భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ అన్నారు. భద్రాచలం పోలీసు స్టేషన్‌లో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంను డీఎస్పీ అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇల్లు, వీధిలో సైతం మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా సంరక్షించాల్సిన మనందరిపై ఉందన్నారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో నిరంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తూ ప్రకృతి సంపదను పెంచేందుకు దోహదపడటం ఎంతో అభినందనీయమన్నారు.

## సుభాష్ నగర్ లో పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్

### 262 ఇళ్ల తనిఖీ, 82 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**భద్రాచలం ఆగస్టు 26 (జనంసాక్షి)**



భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో పోలీసులు బుధవారం తెల్లవారుజామున కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. కాలనీలోని 262 ఇళ్లను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న 82 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. పెండింగ్ చలాన్లను వసూలు చేయడంతో పాటు సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ అరుణ్ కుమార్ కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సక్రమంగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా వంటి మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గంజాయికి బానిసైన వారి వివరాలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని తగిన ధ్రువీకరణ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్ ఐలు, పోలీస్ సిబ్బంది, సీఆర్ పీఎఫ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై గ్రామసభలు

**చంద్రుగొండ, ఆగస్టు 26 (జనం సాక్షి):**




రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం (ఆగస్టు 27) గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ గ్రామసభల్లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను చదివి వినిపించడంతో పాటు, జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ప్రజలకు సూచించనున్నారు. ఓటరు జాబితాలో పేరు చేర్పు, తొలగింపు, మార్పులకు సంబంధించి ఫారం-6, 7, 8లను స్వీకరించనున్నారు. అదేవిధంగా గైర్హాజరు ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, మరణించినవారు, ద్వంద్వ ఓటర్లకు సంబంధించిన జాబితాను కూడా గ్రామసభలో చదివి వినిపించనున్నారు. వీటిపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించే గ్రామసభలకు గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అన్ని హంగులతో గిరిజన మ్యూజియం- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం ఆగస్టు 26 (జనంసాక్షి)** భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణం లోని గిరిజన మ్యూజియంను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్ది చూపరులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. బుధవారం మధ్యప్రదేశ్ లోని భోపాల్ గిరిజన మ్యూజియం పరిశీలనకు ఐటీడీఏ అధికారులు బయలుదేరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 2025 ఏప్రిల్ లో ప్రారంభమైన భద్రాచలం గిరిజన మ్యూజియంకు సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా బెస్ట్‌అవార్డు అందుకోవడం గర్వకారణ మన్నారు. మ్యూజియంను పూర్తిస్థాయి హంగులతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖకు ప్రతిపాదనలు పంపగా రూ.కోటి నిధులు మంజూరయ్యా యని తెలిపారు. కేంద్ర శాఖ సూచనల మేరకు భోపాల్ మ్యూజియంలోని కళాఖండాలు, ప్రదర్శన విధానం, ఇతర సౌకర్యాలను పరిశీలించి, అదే తరహాలో భద్రాచలం మ్యూజియంను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ వేణు, ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, మ్యూజియం ఇన్ చార్జి వీరాస్వామి, సిబ్బంది సూపల్ శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

### ○ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి రావాలి .. ○ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్ పిలుపు

**తిరుమల పాలెం ఆగస్టు 26 జనం సాక్షి** రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేడు తిరుమలాయపాలెం మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోపాలపురం గ్రామములో ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు నూతనముగా నిర్మించ తలపెట్టిన పాఠశాల భవనానికి శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన విద్య వసతి అభివృద్ధి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పాఠశాల భవన నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులో వస్తాయని ఆయన పేర్కొన్నారు మంత్రి పొంగిలేని శ్రీనివాస్ రెడ్డి పర్యటన విజయవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఐక్యతను చాటాలని కొప్పుల అశోక్ కోరారు మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు మంత్రి పొంగేటి శ్రీనివాసరెడ్డి పర్యటనకు విజయవంతం చేద్దాం కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## బాలికల వసతి గృహంలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 26(జనంసాక్షి):**
మండలంలోని టీజీ మోడల్ స్కూల్ భూదాన్ పోచంపల్లికి అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 1, ఏఎన్ఎం 1, రాత్రి కాపలాదారుడు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. హెడ్ కుక్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఏఎన్ఎం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. రాత్రి కాపలాదారు పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 3, 2026లోగా ఎంఈవో కార్యాలయంలో సమర్పించాలని ఎంఈవో కోరారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట పట్టణంలోని 36వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి మంజూరైన 5లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న కల్వర్టు నిర్మాణ పనులకు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, గోపాలపురం చర్చి స్థలం 10 గుంటల భూమిని తీసుకొని వారికి మరోచోట ఇప్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు జాతీయ రహదారి అనుసంధానానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తూ, అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారూఖ్,మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన ఎంసీ కోటిరెడ్డి, పాశం గోపాల్ రెడ్డి తదితరులు

## హాలియా మున్సిపాలిటీలో ఓటర్లకు ఎస్ఐఆర్ నోటీసులపై కమిషనర్ సూచనలు

**హాలియా, ఆగస్టు 25 జనంసాక్షి :**
హాలియా మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం రెండో దశలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు పురపాలక సంఘం కమిషనర్ కె. రవీందర్ రెడ్డి తెలిపారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు తప్పుగా నమోదై ఉండి, సంబంధిత వివరాలతో అనుసంధానం అయిన ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వారీగా హాజరు కావాల్సిన తేదీ, సమయాన్ని తెలియజేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన తేదీ, సమయానికి ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించి, తమ పేరు మరియు పూర్తి వివరాలకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని కమిషనర్ సూచించారు. మరింత సమాచారం కోసం సంబంధిత



పోలింగ్ కేంద్రానికి చెందిన మండల స్థాయి ఓటరు అధికారి ఫోన్ నంబర్ నోటీసులో పొందుపరిచినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా తమకు కేటాయించిన తేదీ, సమయంలో హాజరై అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని కమిషనర్ కె. రవీందర్ రెడ్డి కోరారు.

## రిక్షా కాలనీలో ఘనంగా వినాయక చవితి కర్రపూజ

**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసాక్షి)**
బూర్గంపహాడ్ మండలం సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 14వ వార్డు రిక్షా కాలనీలో 'శక్తి యూత్' ఆధ్వర్యంలో వినాయక చవితి కర్రపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ.. పండుగలను పురస్కరించుకుని యువత



ఇలాంటి సేవా, ఆధ్యాత్మిక కార్య క్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో ప్రజాపాలన సాగుతోందని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు మూలా నవ్యశ్రీ రెడ్డి, కొమరం సావిత్రిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, దామెర ఆదినారాయణ, యువజన నాయకులు పోతిరెడ్డి అశోక్ రెడ్డి, శక్తి యూత్ ప్రతినిధులు మణి, నవీన్, నాగరాజు, శ్యామ్, మధు, సాయి, జంపన్న, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో చేపల దుకాణాల తొలగింపు

### - ఆక్రమణలపై చర్యలకు స్థానికుల విజ్ఞప్తి

**బూర్గంపహాడ్ ఆగస్టు 26 (జనంసా)క్షి**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన చేపల దుకాణాలను గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది తొలగించారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వ్యాపారులు బేఖాతరు చేస్తూ దుకాణాలు కొనసాగించడంతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించి రహదారిపై దుకాణాలు నిర్వహిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే క్రమంలో, సారపాక ప్రధాన సెంటర్ నుంచి ఇరవెండి వెళ్లే మార్గంలో డ్రైనేజీ హద్దులు దాటి రోడ్డుపైకి విస్తరించిన దుకాణాల ఆక్రమణలను కూడా గుర్తించి వెనక్కి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే చేపల వ్యాపారులకు పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని, ట్రాఫిక్ సమస్యలు మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





## ప్రధాన రహదారిపై రాఖీ దుకాణాలకు అనుమతి లేదు

### హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ హెచ్చరిక

**హాలియా, ఆగస్టు 25 జనంసాక్షి:**
రాఖీ పండుగ సందర్భంగా హాలియా పట్టణంలోని ప్రధాన రహదారులపై రాఖీ దుకాణాలు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతి లేదని హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ తెలిపారు.ప్రధాన రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల రక్షణ, రహదారులపై సజావుగా రాకపోకలు సాగేందుకు వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సాయి ప్రశాంత్ కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామన్నపేట, ఆగస్టు 26 (జనంసాక్షి):**
రామన్నపేట 132 కె.వి సబ్ స్టేషన్ పరిధిలో 33 కె.వి లైన్ వర్క్ చేస్తున్న కారణంగా రామన్నపేట, ఎల్లంకి, తుమ్మలగూడం, లక్ష్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల అగ్రికల్చర్ (వ్యవసాయ) 11 కె.వి ఫీడర్స్ కి 12.00 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ యం.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి 12 గంటల నుండి గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యవసాయ మోటర్లకు సప్లై ఉంటుందని కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఘనంగా తేజ్ వేడుకలు

**నల్లగొండ ప్రతినిధి,ఆగస్టు 26,(జనం సాక్షి):**
మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థుల ఆధ్వర్యంలో తేజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం పెంపొందించడంతో పాటు గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాటలు, నృత్యాలు తదితర కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. తేజ్ పండుగ విశిష్టత, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను విద్యార్థులు వివరించారు.గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు సతీష్, దేవదాస్, ఆకాశ్‌తో పాటు పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## గుర్రంపోడు పోలీసుల చాకచక్యం..

### బాధితుడికి ఫోన్ అందజేత



**గుర్రంపోడు, ఆగస్టు 26,(జనంసాక్షి):**
మండల కేంద్రానికి చెందిన వంగూరి సాయి తేజ గత నెల మొదటి వారంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్రంపోడు పోలీసులు చాకచక్యంగా వెతికి పట్టుకున్నారు. దేవరకొండలో లభ్యమైన ఈ ఫోన్‌ను గుర్రంపోడు సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న బుధవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అందజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సాయి తేజ గత నెలలో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేశారు. మొబైల్ ట్రాకింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ ఫోన్ ఎక్కడ ఉందో నిరంతరం పర్యవేక్షించారు. ఈ క్రమంలో సదరు మొబైల్ దేవరకొండలో ఉన్నట్లు సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించి, పోలీసులు అక్కడకు వెళ్లి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోయిన తన ఫోన్‌ను అతి తక్కువ కాలంలోనే వెతికి పట్టుకుని స్వయంగా అందజేసినందుకు బాధితుడు సాయి తేజ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నకు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఫోన్ పోగొట్టుకున్న వారు అధైర్యపడకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## పేదల సొంతింటి కలను సా కారం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ

### హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**హాలియా ఆగస్టు 26 జనంసాక్షి**
హాలియా మున్సిపాలిటీ 7వ వార్డ్‌కు చెందిన లింగాకర్ శిరీష్ మరియు శంకర్ దంపతుల నూతన ఇండిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాలియా మున్సిపాలిటీ చైర్మన్ శ్రీ చింతల చంద్రారెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన గృహప్రవేశం గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాల కోసం అమలులో ఉన్న 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' వల్ల ఎన్నో కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని, ఈ పథకం సమాజాన్ని స్థిరత్వానికి దారి తీస్తుందన్నారు. కొత్త నివాసంలో కుటుంబ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆయన అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో 2వ వార్డ్ కౌన్సిలర్ సలహాధారు నకిరేకంటి సైదులు, 6వ వార్డ్ కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, 8వ వార్డ్ కౌన్సిలర్ గౌహర్ జబీన్ మజహార్, 12వ వార్డ్ కౌన్సిలర్ సలహాధారు యడవెల్లి రంజిత్, పోలె మధు తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ



**రామన్నపేట, ఆగస్టు 26 (జనంసాక్షి):**
గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య సేఫ్టీ మోకులు వినియోగించడంపై బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని తాటివనంలో అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. కాటమయ్య సేఫ్టీ మోకులు కార్మికులకు వృత్తిపరమైన ప్రమాదాలను తగ్గించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టి, సేఫ్టీ పరికరాలను ప్రతి కార్మికుడికి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బాలాజీ నాయక్ ఎస్సై శంకర్ శివకృష్ణ కానిస్టేబుల్ కృష్ణ బీసీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ వెంకన్న యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి బావండ్లపల్లి బాలరాజు మండల అధ్యక్షుడు కూనూరు మల్లేశం, కాసాని సత్తయ్య, సైదులు, పొడిచేటి వీరయ్య, తండు శివశంకర్ సొసైటీ అధ్యక్షులు బైరు శంకరయ్య, ఎర్ర వెంకటేశం, అంతటి దశరథ, గుండాల యాదయ్య, జహంగీర్, మల్లేశం, అశోక్, గోపగోని ధర్మరాజు, కార్మికులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

### బేతెస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పెషేంట్స్ కు బ్రెడ్,పండ్ల పంపిణీ

సూర్యాపేట (జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో బుధవారం భారతరత్న సేయింట్ మదర్ థెరిసా స్పూర్తితో బేతెస్థ ఫౌండేషన్ చైర్మన్ దుర్గం కరుణశ్రీ రోగులకు 500 బ్రెడ్ ఫ్యాకెట్స్, అరటి పండ్లను పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాథలకు,వ్యాధిగ్రస్థులకు అమ్మ అయినా మదర్ థెరిసా జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. మదర్ థెరిస్సా స్పూర్తితో ఎన్నో మంచి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి మీసాల సైదులు అన్నారు. అనంతరం ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మథర్ థెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కో చెర్మెన్ బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ మదర్ థెరిసా 1910 ఆగస్టు 26న ఆగ్నేస్ గోక్షా బొజాక్షుగా జన్మించిన అల్బేనియా దేశానికి చెందిన రోమన్ కాథలిక్ సన్యాసిని భారతదేశ పౌరసత్వం పొంది మిషనరీస్ అఫ్ ఛారిటీని దేశంలోని కలకత్తాలో 1950లో స్థాపించారని అన్నారు. 45 సంవత్సరాల పాటు మిషనరీస్ ఆఫ్ ఛారిటీని భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలలో పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్నవారికీ పరిచర్యలు చేసినట్లు తెలిపారు.1970 నాటికి మానవతావాదిగా, పేద ప్రజల, నిస్సహాయుల అనుకూలురాలిగా అంతర్జాతీయ కీర్తి పొందారని అన్నారు.తన మానవ సేవకు గాను 1962లో పద్మశ్రీ, 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని, 1980లో భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్నను పొందారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంకా ఎన్నో అవార్డ్సు అందుకున్నారని తెలిపారు. మదర్ థెరీసా మిషనరీస్ అఫ్ ఛారిటీ విస్తృతమై, ఆమె చనిపోయే నాటికి 123 దేశాలలో 610 సంఘాలను కలిగి, హెచ్ఐవి ఎయిడ్స్ ,కుష్టు,క్షయ వ్యాధిగ్రస్తులకు ధర్మశాలలను,గృహాలను,ఆహార కేంద్రాలను,బాలల,కుటుంబ సలహా కార్యక్రమాలను,అనాథ శరణాలయాలను, పాఠశాలలను స్థాపించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం నకు సహకరించిన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్లకు, నర్సులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డా.ఐ.కామేశ్వర్,బైరు వెంకన్న గౌడ్, చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ జాటోత్ డేవిడ్ రాజు,జాతీయ అవార్డు గ్రహీత దయానంద్ వల్లపట్ల , దుర్గం అంజి, బచ్చలకూరి విక్రమ్, సుధాకర్, పేతురు, అబ్రాహాము తదితరులు పాల్గొన్నారు.

### అప్పుల బాధతో పురుగుల మందు తాగి

## కూలీ కార్మికుడు మృతి

### ముగ్గురు కుమార్తెల వివాహాల కోసం చేసిన అప్పులే కారణం



**గుర్రంపోడు ఆగస్టు 26 (జనంసాక్షి)**
ముగ్గురు కుమార్తెల వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ కూలీ కార్మికుడు పురుగుల మందు తాగి మృతి చెందిన విషాద ఘటన మోసంగి గ్రామంలో చోటుచేసుకుంది. మోసంగి గ్రామానికి చెందిన కాశిమల్ల వెంకటయ్య (56), తండ్రి కొండయ్య, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన ముగ్గురు కుమార్తెల వివాహాల సమయంలో చేసిన అప్పులు తీర్చడం ఎలా అనే ఆందోళనతో కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 24వ తేదీ ఉదయం తన వ్యవసాయ భూమి వద్ద పత్తి పంటకు వినియోగించే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో 25వ తేదీ రాత్రి 11.20 గంటలకు వెంకటయ్య మృతి చెందాడు. మృతుడి భార్య కాశిమల్ల జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## 32 కళ్యాణలక్ష్మి చెక్కులు వెంటనే పంపిణీ చేయాలి

**లబ్ధిదారులకు అందించకుంటే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి**

**చెక్కులు వచ్చాయి.. లబ్ధిదారులకు ఇవ్వడంలో ఎందుకీ జాప్యం?"**

**అధికారుల తీరుపై పాశం గోపాల్‌రెడ్డి ఆగ్రహం**

**గుర్రంపోడు, ఆగస్టు 26(జనంసాక్షి):**
మండల తహశీల్దార్ కార్యాలయానికి చేరిన 32 కళ్యాణలక్ష్మి?షాదీముబారక్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. చెక్కుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాశం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కళ్యాణలక్ష్మి?షాదీముబారక్ పథకంపై హైకోర్టు స్టే విధించిందని ఆరోపించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే ఈ పథకంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు.రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆగస్టు 14తో గడువు ముగిసిన రైతు బీమా పథకాన్ని పునరుద్ధరించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.ఎన్నికల ముందు 22ఏ భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని భూములను 22ఏ జాబితాలో చేర్చి రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల హామీలను విస్మరించడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ ప్రజలను మోసం



చేస్తోందని మండిపడ్డారు.ధర్నాకు సిద్ధంతహశీల్దార్ కార్యాలయంలో ఉన్న 32 కళ్యాణలక్ష్మి?షాదీముబారక్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, లేకుంటే కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని పాశం గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**దేవతామూర్తుల కళ్యాణాన్ని తిలకించిన ప్రజలు**

**కనగల్లు, ఆగస్టు 26 (జనంసాక్షి)**

కనగల్ మండల కేంద్రంలోని శ్రీ భవానీల లక్ష్మి శ్రీ వెంకటేశ్వర స్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అర్చకుల వేదమంత్రోచనాలతో అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణాన్ని సాంప్రదాయ బద్ధంగా జరపగా గ్రామ ప్రజలు దేవతామూర్తుల కళ్యాణాన్ని ఆనందంగా తిలకించి మంత్రముగ్ధులైనారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురలీధర్ గౌడ్ ఉపసర్పంచ్ మండల చంద్రయ్య, మాజీ సర్పంచ్ చెట్ల లింగయ్య, వేముల నరహరి ఉత్సా కమిటీ సభ్యులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

## 29న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం

**తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలకు తెర**



**అశ్వాపురం ఆగస్టు 26 (జనంసాక్షి):**

తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు శుభవార్త. రైతుల చిరకాల ఆకాంక్షగా ఉన్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఈ నెల 29న ప్రారంభం కానుంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ పథకం అందుబాటులోకి రావడంతో తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగు పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



## ఉద్యోగుల సమస్యలపై రేపు భారీ ధర్నా

**పెద్ద సంఖ్యలో తరలిరావాలి.. మహిళా విభాగం పిలుపు**

**ఖమ్మం, (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఖమ్మం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం నాయకులు తెలిపారు. ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాకు జిల్లాలోని మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగుల జీత భత్యాలు పెరగకపోవడంతో కుటుంబాలను నెట్టుకురావడం భారంగా మారిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులు ఒకవైపు ఇంటి బాధ్యతలు, మరోవైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నప్పటికీ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, రుణ వాయిదాలు, ప్రయాణ ఖర్చులు పెరిగిపోవడంతో తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆదాయం పెరగకపోవడంతో కుటుంబ అవసరాలను వాయిదా వేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలను సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యాలను వెంటనే విడుదల చేసి, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఉద్యోగ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే శాంతియుత నిరసన ధర్నాలో జిల్లాలోని మహిళా ఉద్యోగులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ధర్నాలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో మహిళా విభాగం చైర్‌పర్సన్ జి. మృదుల, సంఘం సంయుక్త కార్యదర్శి ఎస్. రాధికా రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎన్ విజయ, పద్మావతి, కోమలి, సిహెచ్. నాగమణి, పి. జ్యోతి, ఎన్. నాగమణి, రమణ, శ్రావణి, వసంత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదు

**కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కసిగా పనిచేయాలి: మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

**కష్టపడి పనిచేసే కార్యకర్తలను పార్టీ ఎప్పటికీ మర్చిపోదు**

**చంద్రుగొండ, ఆగస్టు 26 (జనంసాక్షి):**

అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు చంద్రుగొండ మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఆయన పర్యటనతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మద్దుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ దిమ్మను ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. కార్యాలయం కోసం స్థలం అందించిన మంచినేని వెంకటేశ్వం రావును శాలువాతో సత్కరించారు. రావికంపాడు గ్రామంలోనూ నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ దిమ్మను ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. చంద్రుగొండ మండల కేంద్రంలో కుక్కడపు ఉపేందర్‌రావు?స్వాతి దంపతుల కుమారుడు సాయి నిఖిల్ వివాహ వేడుకలో, అలాగే సోమనపల్లి నాగేశ్వరరావు? పద్మకుమారి దంపతుల కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దామరచర్ల గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన షేక్ నాగుల్‌మీరా పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి బీఆర్ఎస్ సైనికుడు కసిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే ఏ ఒక్క కార్యకర్తను పార్టీ ఎప్పటికీ మర్చిపోదని, ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. కార్యకర్తలకు ఏ సమయంలో ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని, పార్టీ కార్యాచరణలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును



విజయవంతం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడుతున్న జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావును రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన ప్రతిష్ఠను దిగజార్చేందుకు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. అయితే న్యాయస్థానం ఆ కేసును కొట్టివేసిందని, నిజం ఎప్పటికీ గెలుస్తుందని అన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా భవిష్యత్తులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేగా కాంతారావు నాయకత్వంలో ఐదు నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు .



## పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ.. యువత సద్వినియోగం చేసుకోవాలి..

**ఇన్స్పెక్టర్ ఎల్లయ్య..**

**అశ్వాపురం, ఆగస్టు 26 (జనంసాక్షి):**




పోలీస్ శాఖలో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కోచింగ్‌తో పాటు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు ఫారాలను అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు సెప్టెంబర్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో అర్హత సాధించిన వారికి ఉచిత శిక్షణతో పాటు రెసిడెన్షియల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పోలీస్ ఉద్యోగాల ఎంపికలో ప్రిలిమినరీ, దేహదారుఢ్య పరీక్ష, మెయిన్స్ పరీక్షలు కీలకమని, వీటికి అనుగుణంగా అభ్యర్థులను అన్ని విధాలుగా సిద్ధం చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అవసరమైన శిక్షణ, స్టడీ మెటీరియల్ అందించి, ఉద్యోగం సాధించే వరకు పోలీస్ శాఖ తరఫున అండగా ఉంటామని పేర్కొన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి తమ విద్యార్హతలు, వయస్సు, శారీరక ప్రమాణాలు, ఆరోగ్య అర్హతలను ముందుగానే సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కష్టపడి, పట్టుదలతో సాధన చేస్తే పోలీస్ ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, మండలం నుంచి అత్యధిక మంది పోలీస్ ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య పిలుపునిచ్చారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే..

# ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం..!

సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన రెండున్నర సంవత్సరాల్లో కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, పేదింటి గుమ్మానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చేర్చుతామని స్పష్టం చేశారు.

**రూ.12.83 కోట్లు మంజూరు..**

కైకొండాయిగూడెం 1వ డివిజన్‌లో ఈరోజు శంకుస్థాపన చేసిన రూ.కోటి పనులతో కలిపి ఇప్పటివరకు సుమారు రూ.12.83 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేసి, అనేక పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఒకటో డివిజన్ పరిధి విస్తృతంగా ఉండటంతో ఇంకా అనేక ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాల అవసరం ఉందన్నారు. డివిజన్‌లో మిగిలిన రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను దశలవారీగా కేటాయించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను



అభ్యసించేందుకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం పెంచామని చెప్పారు.

పేద పిల్లలు చదువులో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు ఎలాంటి తావు ఉండదని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవంతో జీవించేందుకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ×, ప్రజల మౌళిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సాంకేతికతతో క్యాన్సర్ వ్యాధికి చికిత్స

**–యశోద హాస్పిటల్ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్**

**సూర్యాపేట(జనంసాక్షి):** క్యాన్సర్ వ్యాధి చికిత్సకు ప్రస్తుతం అనేక ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగికి ఒకే రకమైన చికిత్స విధానం సరిపోదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుభట్లు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స విధానాన్ని నిర్ణయిస్తామని తెలిపారు. క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం, రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం, చికిత్స వల్ల కలిగే దుష్ప్రభావాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం ఆధునిక క్యాన్సర్ చికిత్స ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఆధునిక సాంకేతికతతో చికిత్సలో దుష్ప్రభావాలను తగ్గించడంతో పాటు చికిత్స ప్రభావాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో అత్యాధునిక వికిరణ చికిత్స సాంకేతికతతో కూడిన హైపర్‌సైట్ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంలో క్యాన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తించి అక్కడికే చికిత్స అందించడం ద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. చికిత్సను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించడం ఈ సాంకేతికత ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రతి నెల రెండో, నాలుగోవ బుధవారాల్లో సూర్యాపేటలోని కనెక్ట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రోగులకు వైద్య సలహాలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ మేనేజర్ కర్నే సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ బృందం మేనేజర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సాగునీరు ఇవ్వలేక సాకులు చెప్తున్నారు

## హుజూర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి..

**నేరేడుచర్ల ఆగస్టు 26 (జనంసాక్షి ):** గతంలో సాగర్ నీటి గరిష్ట స్థాయిలో ఉన్న రైతుల అవసరం కోసం సాగునీటికై నీటిని విడుదల చేసి చెరువులని నింపిన ఘనత అప్పటి సీఎం కేసీఆర్కే దక్కిందని హుజూర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండల కేంద్రాల్లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగర్ ఎడమ కాలువ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేరేడుచర్ల పట్టణంలో పాలకవీడు, గరిడేపల్లి, నేరేడుచర్ల,మండలాల నాయకులు,రైతులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ లో 535 అడుగుల నీరు ఉన్న కూడా, వరి నార్లు, పంటలను ఎందుకు ఎండ బెడుతున్నారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ ఈ ప్రాంత మంత్రిగా ప్రజలకు చెప్పవలసిన బాధ్యత మీకు లేద అని,మిమ్మలి ఎమ్మెల్యే గెలిపించిన పాపానికి రైతుల పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలని. రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి అవసరాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల



చేయడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు విమర్శించారు. నేడు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆంధ్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తూ కనీసం పోతిరెడ్డిపాడు నుండి 30 నుంచి 40 వేల క్యూసెక్కుల నీళ్లు తరలిపోతుంటే కనీసం ఆ నీటిని అడ్డుకోవడం కూడా చేతగాని పరిస్థితుల్లో ఉందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా అన్ని విధాలుగా అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు.. ఇప్పటికైనా కాంగ్రెస్ తెచ్చిన కరువును ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు.. ఎగువ నుంచి వరద వస్తున్నా కానీ కనీసం రైతుల అవసరం కోసం సాగునీటిని విడుదల చేయకపోవడం వెనక కుట్ర దాగుందని ఆరోపించారు. ఈ ధర్నా కార్యాలయంలో నేరేడుచర్ల, పాలక వీడు మాజీ మండలాల అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, క్రిష్టిపాటి అంజిరెడ్డి, మాజీ డిసిసిబి డైరెక్టర్ మున్సిపల్ కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి,మాజీ ఎంపీపీ చెన్న బోయిన సైదులు,మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు, మాజీ మార్కెట్ చైర్మన్లు కడియ వెంకట్ రెడ్డి, నాగండ్ల శ్రీధర్, నేరేడుచర్ల,పాలకవీడు, గరిడేపల్లి మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గుర్రం మార్కండేయ, చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, రాపోలు నవీన్, పల్లె పంగ నాగరాజు, పసుపులేటి సైదులు, భూక్యా రవినాయక్, తాటిగొండ వెంకట్ రెడ్డి, పెరుమళ్ల సతీష్, పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

చింతలపాలెం(జనంసాక్షి) మహిళల ఆర్థికాభివృద్ధి,స్వయం ఉపాధికి చిహ్నంగా నిలిచే స్వయం సహాయక సంఘాల నూతన భవన నిర్మాణానికి గుడి మల్కాపురంగ్రామ సర్పంచ్ పోలనేడి నరసమ్మ శంకుస్థాపన చేశారు. గ్రామ



పంచాయతీ లో బిసి కాలనీ ఏర్పాటు చేసిన ఈ భూమి పూజ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోలనేడి నరసమ్మ మాట్లాడు తూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతోనే ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే పొదుపు సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించు కోవడానికి, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవ డానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుం దని పేర్కొన్నారు. మహిళల సాధికారత కు తమ గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహ రావు,మహిళలు,గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి

**నేరేడుచర్ల ఆగస్టు 26 ( జనంసాక్షి):** చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి సమస్యల పై పోరాటం చేసిన నల్గొండ మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి జీవితం ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం పరిధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ



విద్యార్థి దశ నుండే అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని, డిండి ప్రాజెక్టు సాధన కోసం డిండి నుండి హైదరాబాదు వరకు పాదయాత్ర నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం తొడ్డ వెంకటయ్య పాలకూరి బాబు రాజు పున్నయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాల శ్రీను సహాయక కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ భాస్కర్ టిఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్ సిఐటియు మండల కార్యదర్శి నీలా రామ్మూర్తి భాష నిఖిల్ చక్రవర్తి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి

### -హుజూర్ నగర్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా



**హుజూర్ నగర్, ఆగస్టు 26 (జనంసాక్షి):** రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగర్ ఎడమ కాలువకు నీళ్లు విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, హుజూర్ నగర్ పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపుమేరకు, మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరావు, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర గౌడ్ ల ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి హాజరయ్యారు. బుధవారం ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువకు సాగు నీరు విడుదల చేసి రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.×బీఆర్ఎస్ ధర్నా ను ఉద్దేశించి ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ..× ఎగువ నుంచి వరద వస్తున్నా కానీ కనీసం రైతుల అవసరం కోసం సాగునీటిని విడుదల చేయకపోవడం వెనక కుట్ర దాగుందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ధర్నాలో మాజీ మార్కెట్ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ గువ్వల వీరన్న, మాజీ జెడ్పిటిసిలు పాలేటి రామారావు, ఇమ్రాన్, సయ్యద్ అబ్దుల్ నబీ, వివిధ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు మన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఇరుగు పిచ్చయ్య, సూరిశెట్టి బసవయ్య, మోర్తాల వెంకటరెడ్డి, సర్పంచులు బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి, పోలెండి శ్రీనివాసరావు, అద్దంకి సైదీశ్వరరావు, గవిని లింగస్వామి, బేత ప్రతాపరెడ్డి, కౌన్సిలర్ వేల్పుల నాగరాజు, మాజీ సర్పంచ్ లు గుజ్జుల సుజాత అంజిరెడ్డి, షేక్ అలీ, పందిరిపల్లి శంకర్ రెడ్డి, కీత జయమ్మ ధనమూర్తి, వర్ర వెంకటరెడ్డి ,బేత వీరనాగిరెడ్డి, కోలాహలం లక్ష్మీ నరసింహ రాజు, గల్లా సైదులు, కార్మిక నాయకులు వివిధ మండల నాయకులు పచ్చిపాల ఉపేందర్, సారెడ్డి భాస్కర్ రెడ్డి, సాముల మట్టారెడ్డి, ములకలపల్లి రాంబాబు, చంద్రమౌళి ,గిర్ని వెంకటరెడ్డి, కొట్టే నరసింహారావు, రెక్కల శంబిరెడ్డి, కట్ట సతీష్, వీరమల్ల సుందరయ్య, మల్లేపల్లి వీరబాబు ,మాడుగుల పరుశురాం ,దుగ్గి నరసింహారావు, రాగిడి రాజశేఖర్ ,ఎండి ముజీబ్, ఎల్లావుల కృష్ణవేణి ,జక్కుల వెంకటేష్, భోగాల శివారెడ్డి, శీలం నాగరాజు , దగడ గోపి, కష్టాల రామకృష్ణ, శ్రీనివాసరాజు, సాతులూరి వెంకటేశ్వర్లు, అంజి, గోపాల్ ,సాయి, షేక్ మహిబెల్లి, భోగాల శివారెడ్డి, సురభి ధర్మ భిక్షం ,చికూరి నారాయణ , నాగేశ్వరరావు, రాము, ఆవుల వెంకటయ్య, లింగారెడ్డి, గురువారెడ్డి, చీమట సైదులు, నరసింహ యాదవ్, ఉప్పలయ్య, రైతులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అర్వపల్లి లో నిరసన వ్యక్తం చేస్తున్న పలువురు నాయకులు

జాజిరెడ్డిగూడెం మండల **జనంసాక్షి ఆగస్టు (26)**
సూర్యాపేట పట్టణం మీదుగా బుల్లెట్ రైలు ను నడిపించాలని కోరుతూ రైల్వే కారిడార్ సాధన సమితి లక్ష గొంతుల పోలికేక పిలుపులో భాగంగా మంగళవారం రాత్రి అర్వపల్లిలో ఏ ఐ కే ఎం ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో నాయకులు బొడ్డు శంకర్, దోమలపల్లి గోవర్ధన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి బీర్ల ఫౌండేషన్ ఆర్థిక చేయూత



జనం సాక్షి ఆగస్టు (26) ఆత్మకూర్ (ఎం)
మండల కేంద్రానికి చెందిన పంజాల లక్ష్మీ - కీర్తిశేషులు రాములు కుమార్తె మమత వివాహానికి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనితఐలయ్య 5,000/- ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది...ఈ సందర్భంగా పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహాయ సహకారాలు అందజేసిన ప్రభుత్వ విప్, ఆలేరుశాసన సభ్యులు శ్రీ బీర్ల ఐలయ్య కి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత కి నూతన వధువు మమత కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి

### ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకం గ్రామ ప్రజలకు అందేలా చేస్తా

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగస్టు (26)**
మండలం లోని లింగరాజు పల్లి గ్రామా అభివృద్దే లక్ష్యంగా డోజర్ బండి తో సిసి రోడ్ల చుట్టూ ఉన్న చెట్లను,రాళ్లను తొలగిస్తున్న సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి అనంతరం సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ, వీధిలైట్లు,రేషన్ కార్డులు,పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని గ్రామ ప్రజలకు అందే విధంగా చూస్తానని ఆయన అన్నారు గ్రామంలో ఉన్న ప్రతి వార్డు తిరుగుతూ వార్డులో ఉన్న సమస్యలన్నిటిని తెలుసుకొని పరిశుభ్రత చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి



**నేరేడుచర్ల ఆగస్టు 26 ( జనంసాక్షి):**
పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల అధ్యక్షుడు షేక్ యూసఫ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలోని బలహీన వర్గాల కోసం మదర్ థెరిస్సా చేసిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిరుపేదలు, అనాథల కోసం ఆమె సేవలు మానవాళికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు సత్య నారాయణ, బాల వెంకటేశ్వర్లు, లాయర్ విశ్వనాథం, గంధం శావయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాదయాత్ర జయప్రదం చేయలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగస్టు (27)**
బుధవారం రోజు న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారం పై జరుగుతున్న పాదయాత్ర జయప్రదం చేయలి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు బుధవారం రోజున వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు బడ్జెట్ కేటాయించి పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉండాలని అధికారంలోకి వచ్చిన ముందు రాష్ట్రంలో జిల్లాలో ఉన్న ప్రాజెక్టులో కాలువలు పూర్తిచేసి రైతులకు సాగు త్రాగునీరులు అందిస్తామని చెప్పిన నేటికీ పూర్తి చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉన్నదనిపరిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాగు త్రాగునీరు అందించే విధంగా రాష్ట్రంలో జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు కాలువను పూర్తి చేస్తామని మాటలు చెప్పిన



ఆత్మకూరు మండలం లో సంవత్సర తరబడిగా బునాది కాలువ పెండింగ్లో ఉందని సిపిఎం పార్టీ ఆందోళన పోరాటాలు చేసిన సందర్భంలో ఎన్నో కొన్ని నిధులు ఇస్తూ పనులు అవుతున్నాయి అన్నట్టుగా ప్రభుత్వం చేస్తున్నదని చిత్తశుద్ధితో బడ్జెట్ కేటాయించి రైతుల సంక్షేమం కోసం ఆలోచన చేసి వెంటనే పూర్తి చేయవలసిన అవసరం ఉన్నదని పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29 30 31 తేదీల్లో జరుగుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని అదేవిధంగా తేదీ 31హైదరాబాదులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల సిపిఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి మండల పరిధిలో గల కేశ్య తండా గ్రామంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ రామావత్ రాజు నాయక్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.వారివెంట జిపిఓ నాగలక్ష్మి, లచ్చిరాం, జీపి వర్కర్ వినోద్, కళ్యాణ్, కీర్య, లక్ష్మణ్, రంగి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి, కొండమల్లేపల్లి



## మనోహర్ కు నియామక పత్రాన్ని అందజేసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే సామేలు

జాజిరెడ్డిగూడెం మండల **ఆగస్టు 26 ( జనంసాక్షి):** అర్వపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాయిని మనోహర్ ఎన్నిక కావడంతో బుధవారం ఎమ్మెల్యే మందుల సామేలు, మండల అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి వేర్పుల రమేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, మూసి ప్రాజెక్టు చైర్మన్ అల్వాల వెంకటస్వామి, ఏఎంసి డైరెక్టర్ భైరబోయిన సైదులు, ఉపసర్పంచ్ మామిడి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

